
# సాక్షి ఒడిశా

ఆదివారం । 31 । మార్చి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

| | |
|---|---|
| నగదు | రూ. 5,43,516 |
| బంగారం | 28 గ్రాముల 700 మిల్లీ గ్రాములు |
| వెండి | 4 గ్రాముల 750 మిల్లీ గ్రాములు |


– భువనేశ్వర్/పూరీ



**బీజేపీ కార్యాలయంలో రచ్చ**

బీజేపీలో రచ్చ జరుగుతోంది. కార్యకర్తలంతా కలిసి పార్టీ కార్యాలయం ముందు నిరసనకు దిగారు.

-IIలో




## న్యూస్‌రీల్

### జేఎంఎం అభ్యర్థిగా అంజనీ సోరెన్



అంజనీ సోరేన్

**భువనేశ్వర్:** మయూర్ భంజ్ నియోజకవర్గం నుంచి లోక్‌సభ ఎన్నికలకు జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అభ్యర్థిగా అంజనీ సోరెన్‌ను ప్రకటించారు. అంజనీ జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరేన్ కుమార్తె. ఈ నియోజకవర్గంలో బీజేపీకి చెందిన నొబొ చరణ్ మాఝీ, బీజేడీకి చెందిన సుదామ్ మరాండీతో ఆమె ఎన్నికల్లో తలపడనున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సొంత జిల్లా అయినందున మయూర్‌భంజ్‌కు ఎన్నికల్లో ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈసారి జరగనున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని భారతీయ జనతా పార్టీ దృఢ సంకల్పంతో పని చేస్తోంది. లోగడ 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ నుంచి బిశ్వేశ్వర టుడు, అంతకుముందు 2014లో జరిగిన ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థి రామచంద్ర హంసదా ఈ నియోజకవర్గం నుంచి గెలిపొందారు.

### కాళీరాంకు ఘన స్వాగతం



సమావేశంలో మాట్లాడుతున్న కాళీరాం మాఝి తదితరులు

**రాయగడ:** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆ పార్టీ అధిష్టానం కాళీరాం మాఝికి టిక్కెట్టు ఖరారు చేయడంతో, జిల్లాలోని టికిరిలో ఆ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాళీరాం మాఝి మాట్లాడుతూ బీజేడీలో వర్గ విభేదాలతో ఆ పార్టీ నాయకులు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం బీజేపీ అనుకూల పవనాలు వీస్తున్నాయని, రానున్న ఎన్నికల్లో విజయం ఖాయమని పేర్కొన్నారు. కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యుడు బసంత కుమార్ ఉలక, యువనేత ప్రతాప్ పువల, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

### రాయగడ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా టుటూ దాస్



ఎన్నికైన కార్యవర్గంతో న్యాయవాదులు

**రాయగడ:** రాయగడ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా పద్మనాభ (టుటూ) దాస్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం జరిగిన ఎన్నికల్లో ఆయన విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన సునీల్ నాయక్, నవ కిషోర్ కంట, అరుణ్ పాణిగ్రాహిలు అధికారికంగా ప్రకటించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ 12 గంటలకు ముగిసింది. మధ్యాహ్నం 4 గంటలకు ఓట్ల లెక్కింపు జరిగింది. 2024–25 ఏడాదికి గాను రాయగడ బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి పద్మనాభ దాస్ (టుటు), పి.జగన్మోహన్‌రావు, బిభూది ప్రధాన్‌లు ఎన్నికల బరిలో నిల్చున్నారు. టుటు దాస్‌కు 59 ఓట్లు, జగన్మోహన్‌రావుకు 56 ఓట్లు, బిభూది ప్రధాన్‌కు 49 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యక్షులుగా ఎద్దు శ్రీనివాస్‌రావు, సాధారణ కార్యదర్శిగా బిశ్వనాథ్ గంతాయిత్‌లు ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా, సహ కార్యదర్శి పదవికి గేదెల కిశోర్, శుభక్రాంతి బెహరాలు పోటీ పడ్డారు. వీరిలో శుభ్రకాంతి బెహరా విజయం సాధించారు. కోశాధికారిగా నీలాంచల్ బిసాయి ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గాన్ని న్యాయవాదులు అభినందించారు.

### బీజేడీలోకి మాజీ ఎమ్మెల్యే సూర్యారావు




బీజేడీ నాయకులతో సూర్యారావు

**పర్లాకిమిడి:** గజపతి జిల్లా పర్లాకిమిడి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కెంగం సూర్యారావు శనివారం బీజేడీ పార్టీలో చేరారు. భువనేశ్వర్‌లో జరిగిన బీజేడీ మిశ్రణ్ పర్బ్‌లో రాష్ట్ర మంత్రి అతాను సవ్యసాచి నాయక్, ఎమ్మెల్యే ప్రణబ్ ప్రకాష్ దాస్, బీజేడీ పార్టీ వ్యవహారాల అధ్యక్షుడు మానస రంజన్ మంగరాజ్, గజపతి జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. సూర్యారావు చేరికతో బీజేడీ మరింత బలోపేతమైందని మానస రంజన్ మంగరాజ్ అన్నారు. సూర్యారావుతో పాటు ఆయన అనుచరులు కూడా చేరారు.

# కొన్ని రాజీలు.. ఇంకొన్ని రాజీనామాలు

- రసవత్తరంగా ఒడిశా రాజకీయం
- పార్టీలు మారుతున్న ఆశావహులు
- టికెట్ దక్కించుకోవడమే అంతిమ లక్ష్యం



బీజేడీలో చేరిన పర్లాకిమిడి కాంగ్రెసు మాజీ ఎమ్మెల్యే కె. సూర్యారావు

**భువనేశ్వర్:** సార్వత్రిక ఎన్నికల తేదీలు దగ్గర పడుతున్న కొద్దీ ఒడిశా రాజకీయం రసవత్తరంగా మారుతోంది. టికెట్ ఆశావహులు ఎక్కడ తమకు అనువుగా ఉంటుందో చూసుకుని అటువైపు వెళ్లిపోతున్నారు. అధికార పక్షం నుంచి విపక్షంలోకి కొందరు వెళ్లిపోతుండగా, విపక్షం నుంచి అధికార పక్షంలోకి మరికొందరు జంప్ చేస్తున్నారు. ఇంకొందరు రాజీ వైఖరితో నిశ్శబ్దంగా ఉండిపోతున్నారు. నాయకుల్లో చాలా మంది తమకు టికెట్ రాదని ఏమాత్రం సమాచారం అందినా వెంటనే పార్టీ మారిపోవడానికి ఏ మాత్రం సంకోచించడం లేదు.

ఇప్పటికే రాష్ట్రంలో అధికార, ప్రధాన విపక్షాలు తొలి అభ్యర్థుల జాబితాను విడుదల చేశాయి. అయితే కీలక స్థానాలకు మాత్రం ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. కాంగ్రెస్ ఏ క్షణంలోనైనా అభ్యర్థుల జాబితా విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు అధికార బిజూ జనతా దళ్ తెరిపి లేకుండా పార్లమెంటు, శాసన సభ నియోజక వర్గాల వారీగా ప్రాంతీయ నాయకులతో చర్చలు జరుపుతోంది. చాలా మంది సిట్టింగ్ నాయకులకు ఈ సారి మొండి చేయి చూపబోతున్నట్లు, వారు పార్టీ మారబోతున్నట్లు తెలుస్తోంది. విచిత్రంగా



బీజేపీలో చేరిన భువనేశ్వర్ (ఉత్తర) మాజీ ఎమ్మెల్యే ప్రియదర్శి మిశ్రా

బీజేపీ, కాంగ్రెస్‌లో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికే చాలా మంది సీనియర్ నాయకులు తమతమ పార్టీలకు రాజీనామా లేఖలు కూడా పంపించేశారు.

**కాంగ్రెసు నుంచి బీజేడీకి**

గజపతి జిల్లాలో పర్లాకిమిడి శాసన సభ నియోజక వర్గం కీలకం. ఈ నియోజకవర్గం గతంలో కాంగ్రెసు, బిజూ జనతా దళ్ ఆధీనంలో ఉండేది. గత ఎన్నికల్లో బీజేపీకి దక్కింది. బీజేడీ ఫిరాయించి బీజేపీలో చేరిన కోడూరు నారాయణ రావు పర్లాకిమిడి నియోజక వర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

2024 సార్వత్రిక సమరం

ఆయనకు దీటైన ప్రత్యర్థిగా నిలిచిన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే కె. సూర్యా రావు శనివారం శంఖ భవన్‌లో బిజూ జనతాదళ్‌లో చేరారు. సస్మిత్ పాత్రో సమక్షంలో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమానికి పలువురు బీజేడీ ప్రముఖులు హాజరయ్యారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నా తనను విస్మరించడంపై సూర్యా రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. 2019 జూన్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. 2014లో పర్లాకిమిడి నియోజక వర్గం నుంచి రాష్ట్ర శాసన సభకు కె. సూర్యారావు ఎన్నికయ్యారు. ఆయన 2019 ఎన్నికలలో ఈ స్థానం నుంచి పోటీ చేసి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కె.నారాయణరావు చేతిలో ఓడిపోయారు. సూర్యారావు బీజేడీలో చేరడంతో పర్లాకిమిడి అసెంబ్లీ సెగ్మెంటులో రాజకీయ పరిణామాలు కొత్త మలుపు తిరిగే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో ప్రత్యర్థిగా నిలిచిన కాంగ్రెసు నాయకుడు బీజేడీలో చేరడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే కె. నారాయణ రావు వ్యూహ రచనపై అందరి దృష్టి నెలకొని ఉంది.

**బీజేడీ నుంచి బీజేపీకి**

బిజూ జనతా దళ్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన కొన్ని గంటల్లో భువనేశ్వర్ (ఉత్తర) మాజీ ఎమ్మెల్యే, బీజేడీ ప్రధాన కార్యదర్శి ప్రియదర్శి మిశ్రా శనివారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. స్థానిక పార్టీ ప్రధాన కార్యాలయంలో భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, ఒడిశా బీజేపీ కో-ఇన్‌చార్జ్ విజయ్‌పాల్ సింగ్ తోమర్ సమక్షంలో యన భారతీయ జనతా పార్టీలో చేరారు. శనివారం ఉదయం ప్రియదర్శి మిశ్రా తన రాజీనామా లేఖను బిజూ జనతా దళ్ అధినేత నవీన్ పట్నాయక్‌కు పంపారు.

పార్టీలో నిరంతర నిర్లక్ష్యం కారణంగా పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా పత్రంలో పేర్కొన్నారు. విద్యార్థి జీవితం నుండి బీజేడీతో అనుబంధం ఉందని మీడియాకు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్‌తో కలిసి పని చేసినట్లు గుర్తు చేశారు. 2019లో పోటీకి టికెట్ నిరాకరించి 2024లో టిక్కెట్ ఇస్తానని పార్టీ అధినేత ఇచ్చిన హామీ నీటి మూటగా మిగిలిందని వ్యాఖ్యానించారు. చాలా కాలంగా పార్టీ కార్యక్రమాలకూ ఆహ్వానించకుండా తనను నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన భువనేశ్వర్ మాజీ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ ప్రసన్న కుమార్ పటసహాణి అల్లుడు. ప్రియదర్శి మిశ్రా 2014 ఎన్నికలలో రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు.

**వైరి పక్షం చెంతకు**

సొంత పార్టీలకు రాజీనామా చేయడంతో వైరి పక్షం గూటికి వీరంతా అడుగులు వేయడం విడ్డూరంగా కనిపిస్తోంది. రాజీనామా పత్రాలు దాఖలు చేసిన ప్రముఖుల్లో అత్యధికులు బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు. బీజేడీ శిబిరం పోకడ గమనిస్తే ఈసారి పలువురు సిట్టింగుల్ని తొలగించి కొత్త ముఖాలకు పట్టం కట్టనున్నట్లు తెలుస్తోంది. అలాగే బీజేడీ నుంచి వైదొలగిన వారిని అక్కున చేర్చుకుని పట్టం గట్టేందుకు ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ లౌక్యంగా వ్యవహరిస్తోంది.

**ఆశల పల్లకిలో**

రాజీనామా పత్రాలు దాఖలు చేస్తున్న నాయకుల అందరి అంతిమ లక్ష్యం టికెట్ సంపాదించడమే. అయితే లోపాయికారీ ఒప్పందం ప్రకారం ఫిరాయింపు దారులకు కొత్త ముఖాలుగా బీజేడీ పట్టం గడితే అసమ్మతి సెగలు వేడెక్కడం తథ్యమనే భయం కూడా వెంటాడుతోంది. తొలి జాబితాలో అసమ్మతి వాదుల నియోజక వర్గాలు మార్చి వారికి కొత్త బాధ్యతలు అప్పగించారు. కాంగ్రెసు, బీజేపీ ఫిరాయించి తమ గూటికి చేరిన వారిపై బీజేడీ త్వరలోనే తన వైఖరిని తేటతెల్లం చేయనుంది. బీజేపీ, కాంగ్రెసు బలంగా ఉన్న ప్రాంతాల నుంచి రాజీనామాతో తమ గూటికి చేరిన వారిని.. ఆయా ప్రాంతాల్లో పోటీకి నిలబెట్టి అంతఃకలహాల్ని ఆసరాగా తీసుకుని ఆజ్యం పోసేందుకు యోచిస్తోంది. ఆ ఆశలు నెరవేరితే బీజేడీ, బీజేపీ మధ్య పోరు హోరాహోరీ అవుతుంది.

**ప్రముఖుల రాజీనామా**

శనివారం ప్రధాన పక్షాలకు చెందిన పలువురు ప్రముఖులు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా పత్రాలు సమర్పించారు. వీరిలో సిట్టింగు పార్లమెంటు సభ్యుడు, బీజేడీ అభ్యర్థి అనుభవ్ మహంతి, సినీ నటుడు, మాజీ ఎమ్మెల్యే ఆకాశ దాస్ నాయక్, కాంగ్రెసు నాయకుడు చిరంజీబ్ బిశ్వాల్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా జగన్నాథ మందిర ప్రతిష్టాపన



పూజారిపుట్‌లో నేతన జగన్నాథ మందిరం



పూజారిపుట్ లో ప్రతిష్ఠించిన శ్రీజగన్నాథ్, బలభద్ర, సుభద్రలు



యజ్ఞశాలలో పూజలు చేస్తున్న పూజారి

**జయపురం:** జయపురం సమితి పూజారిపుట్ గ్రామంలో శ్రీజగన్నాథ్ మందిర ప్రతిష్టాపన ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉల్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 22న ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారంతో పూర్తయ్యాయి. మందిర పరిచాలన కమిటీ బీజేడీ నేత సుభాష్ రౌత్, సూర్యనారాయణ రథ్, బాలంకి రావు, ఎస్.నరేంద్ర, వికాశ పాత్రో, గంగాధర్‌ల పర్యవేక్షణలో ఈ ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరిగాయి. శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొని పూజలు చేశారు. ఆయనతో పాటు న్యాయవాది మదన మోహణ నాయిక్, వేంకటరావు పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న దొండనచో దీక్షలు



దీక్షలు చేస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న దొండొకాళి అమ్మవారు

**బరంపురం:** గంజాం జిల్లాలో భక్తిశ్రద్ధలతో దొండనచో దీక్షలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 14వ తేదీ వరకు ఈ దీక్షలు కొనసాగుతాయి. బరంపురం నగరంలోని వీధుల్లో వివిధ సంఘాల అధ్వర్యంలో దీక్షలు నిర్వహిస్తున్నారు. మిట్ట మధ్యాహ్నంతో మొదలైన పూజలు రాత్రికి దొండొకాళి పూజలు జరిపిన అనంతరం ముగుస్తున్నాయి. జిల్లాలో సుమారు 5 వేల మంది దీక్షలు పాటిస్తున్నారు.

## బా'నిషా' సంకెళ్లు తెంచేందుకు..



హొర్డిలి గ్రామంలో నిషా ముక్త అభిజాన్‌లో పాల్గొన్న ప్రజలు

**జయపురం:** బొరిగుమ్మ సమితి హొర్డిలి పంచాయతీని మద్యం విముక్త పంచాయతీగా మార్చేందుకు ప్రజలు నడుం బిగించారు. శనివారం గ్రామంలోని పురుషులంతా ఈ మేరకు శపథం చేశారు. ముందుగా తమ గ్రామాన్ని నిషా విముక్త గ్రామంగా మార్చాలని ఈ అభిజాన్‌ను చేపట్టామని వారు తెలిపారు. గ్రామంలో సారా విక్రయాలు పూర్తిగా బంద్ చేసేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. తమ గ్రామంలో దాదాపు 20 సారా దుకాణాలు ఉన్నాయని, ఇప్పటి వరకు 30మందికిపైగా ఈ వ్యసనం వల్ల ప్రాణాలు కోల్పోయారని అన్నారు. సారా వల్ల ప్రాణాలు పోవడమే కాకుండా కుటుంబాలు కూడా ధ్వంసమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోనూ అశాంతి నెలకొంటోందని అన్నారు. అందుకే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. సర్పంచ్ భీమ భొత్ర నేతృత్వంలో ప్రజలు ఈ అభిజాన్ చేపట్టారు. ఈ అభిజాన్‌ను ముందుగా బొరిగుమ్మ పోలీసులకు, అబ్కారీ అధికారులకు లిఖిత పూర్వకంగా తెలియజేశామని సర్పంచ్ పేర్కొన్నారు. తాము తీసుకున్న ఈ నిర్ణయాన్ని అధికారులు ఆమోదించి సారా విక్రయాలు బంద్ చేయించాలని లేదంటే అధికారులపై కూడా కేసులు పెడతామని హెచ్చరించారు. అధికారులు చర్యలు చేపట్టేంత వరకు తాము సారా అమ్మకాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.



తమ గ్రామం నిషా ముక్తి కావాలని కట్టిన బ్యానర్

## బొరిగుమ్మలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



బొరిగుమ్మలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్‌లో ఎస్‌డీపీఓ తపశ్విణి తదితరులు

**జయపురం:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బొరిగుమ్మలో పోలీసులు శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. జయపురం శాసనసభ నియోజకవర్గంలో అంతర్భాగమైన బొరిగుమ్మలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని వారు కోరారు. ఫ్లాగ్‌మార్చ్‌లో బొరిగుమ్మ పోలీసు అధికారి యుగళ కిశోర్ షా, బీఎస్‌ఎఫ్ బెటాలియన్, బెటాలియన్ అధికారి ఏఎస్‌ఐ రొచిత మడకామి, ఏఎస్‌ఐ సుభాష్ కుమార్ షాడంగి తదితరులు పాల్గొన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.



బొరిగుమ్మ ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న బీఎస్‌ఎఫ్ జవాన్లు

## ప్రశాంతంగా గంజాం బార్ సంఘం ఎన్నికలు




బార్ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్న సీనియర్ న్యాయవాది సుదీప్ కుమార్ సాహు



గంజాం బార్ ఎన్నికల్లో తన ఓటు వేసేందుకు వస్తున్న సీనియర్ న్యాయవాది

**బరంపురం :** గంజాం బార్ న్యాయవాదుల సంఘం 2023–24 ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో గల గంజాం బార్ న్యాయవాదుల సంఘం కార్యాలయంలో ఎన్నికల అధికారి అనిల్ కుమార్ పండా సమక్షంలో గంజాం బార్ న్యాయవాదుల సంఘం 2023–24 ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష పదవికి నలుగురు, ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు, కార్యదర్శి పదవి కోసం ఆరుగురు, సహాయ కార్యదర్శి పదవి కోసం 2 అభ్యర్థులు తలపడుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎన్నికలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగాయి.



గంజాం బార్ ఎన్నికల తీరు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి బృందం



గంజాం బార్ ఎన్నికల్లో తమ ఓటుని పరిశీలిస్తున్న న్యాయవాదులు

## క్లుప్తంగా

### ఎండలతో జాగ్రత్త: కలెక్టర్

శ్రీకాకుళం పాత బస్టాండ్ : వేసవిలో వేడి గాలులు పెరిగే సూచనలున్నాయని, ఈ పరిస్థితుల దృష్ట్యా ఆ విపత్తులను ఎదుర్కొనేందుకు కట్టుదిట్టమైన ప్రణాళికను ఏర్పాటుచేయాలని జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో కూడా కంట్రోల్ రూమ్‌లు, చలివేంద్రాలు సిద్ధం చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. రానున్న వేసవిలో వడగాడ్పులు దృష్టిలో ఉంచుకుని విపత్తుల నిర్వహణపై అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశారు. వడగాడ్పులు ఎక్కువగా రానున్నట్లు వాతావరణ అధికారులు తెలియజేస్తున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని, నీటి ఎద్దడి లేకుండా నీటి ట్యాంకర్లు సిద్ధం చేయాలని, ప్రధాన కూడళ్ల, బస్టాండ్లు, చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అవసరమైన చోట నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందజేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖలను ఆదేశించారు. అగ్నిమాపక కేంద్రాల వారు అప్రమత్తంగా ఉండాలని, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నవారికి కనీస అవసరాలు సమకూర్చాలని, ప్రాథమిక చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్‌లు నిల్వ ఉంచాలన్నారు. సెలవుల్లో పిల్లలు చెరువులు, గెడ్డలు, బావుల వైపునకు వెళ్లకుండా, ఈతల పేరుతో ప్రాణాలు కోల్పోయే సంఘటనలు రాకుండా ముందస్తుగా అవగాహన కల్పించాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యతలు తీసుకుని పిల్లలకు తగు సూచనలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఎలుగు దాడి బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందజేత


మృతుల కుటుంబాలకు చెక్కులను అందజేస్తున్న అటవీశాఖాధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో గల చీపురపల్లి పంచాయతీ పరిధిలో గల అనకాపల్లి గ్రామానికి చెందిన ఎలుగు దాడి మృతుల కుటుంబాలకు అటవీ శాఖాధికారులు శనివారం ఎక్స్‌గ్రేషియా అందజేశారు. ఇటీవల జరిగిన ఎలుగు దాడి సంఘటనలో అప్పికొండ కుర్మారావు, చిడిపల్లి లోకనాథం మృతి చెందారు. మృతుల కుటుంబాలకు రూ. 2.50 లక్షలు ఎక్స్‌గ్రేషియాలను చెక్కులను అందజేశారు. మరో రూ. 2.50 లక్షలు త్వరలోనే అందిస్తామని అన్నారు. చెక్కు అందజేసిన వారిలో కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజర్ మురళీకృష్ణ నాయుడు, అటవీశాఖ అధికారులు ఎం.పోలయ్య, జోగారావు, ఎ.బాబురావు, సర్పంచ్ ప్రతినిధి దాసరి పాపారావు, గ్రామ పెద్దలు కర్రి తిరుపతి తదితరులు ఉన్నారు.

### 'పీఓ, ఏపీఓలు జాగ్రత్తగా ఉండాలి'


మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

నరసన్నపేట: ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులంతా బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో శనివారం పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఆర్‌ఓ రామ్మోహన రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలు విధిగా పాటించాలని కోరారు. పోలింగ్ రోజున పీఓ, ఏపీఓలు బాధ్యతగా ఉండాలన్నారు. మాక్ పోలింగ్ 90 నిమిషాల ముందు చేపట్టాలని అన్నారు. ఈవీఎంల పనితీరును గమనించాలని సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేస్తే ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నరసన్నపేట ఆర్‌ఓ రామ్మోహనరావు మాట్లాడుతూ నియోజకవర్గ మాస్టర్ ట్రైనీల నుంచి పూర్తి సమాచారం తెలుసుకోవాలని కోరారు. గత ఎన్నికల పద్ధతులు ఇప్పుడు ఉండవని, 2023 నుంచి కొత్త నిబంధనలు వచ్చాయని వీటి ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 740 మంది పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఐసీడీఎస్ పీడీ బి.శాంతి, తహసీల్దార్లు పి.కనకారావు, ఎస్‌ఎల్‌వీ ప్రసాద్, నాగమ్మ, భాగ్యవతి టీడీలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంలో రచ్చ


బీజేపీ కార్యాలయం ఆవరణలో రచ్చ చేస్తున్న కార్యకర్తలు

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ ఎంపీ అపరాజిత షడంగి, చిలికా ఎమ్మెల్యే ప్రశాంత్ జగదేవ్‌లను వ్యతిరేకిస్తూ పార్టీ కార్యకర్తలు ప్రధానంగా ఖుర్దా బీజేపీ నాయకుడు కాలూ ఖండయత్ రాయ్ మద్దతుదారులు పార్టీ కార్యాలయం ముందు శనివారం రచ్చ చేశారు.

వందలాది మంది కాలూ ఖండయత్ రాయ్ మద్దతుదారులు జై శ్రీరామ్‌నినాదాలు చేస్తూ హైడ్రామా సృష్టించారు. ఖుర్దా ప్రాంతంలో ప్రశాంత్ జగదేవ్‌కు టిక్కెట్ ఇవ్వవద్దని నినాదాలు చేశారు. మరోవైపు ఈ విషయంలో ప్రశాంత్ జగ్‌దేవ్ జోక్యం చేసుకుని పరిస్థితిని సద్దుమణిగించారు. కాలూ ఖండాయత్ రాయ్‌కు తన పూర్తి మద్దతు ఉందన్నారు. టికెట్ కోసం తాను బీజేపీలో చేరలేదన్నారు. కాలూ భాయ్ తాను బీజేపీలో చేరికను సులభతరం చేసి సహకరించినట్లు తెలిపారు. తాను బీజేపీ సైనికుడిగా పేర్కొన్నారు. కాలూ భాయ్ ఎన్నికల్లో పోటీ చేయాలని కోరుకుంటున్నట్లు ప్రకటించారు. అతనికి మద్దతుగా నిలుస్తానని అభయమిచ్చారు. ఖుర్దా నుంచి కాలూ ఖండాయత్ రాయ్ టిక్కెట్ ఆశిస్తున్నారు. ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా గుర్తించి ఎన్నికల్లో పోటీ చేసేందుకు తప్పక టిక్కెట్ కేటాయించాలని కోరారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్‌తో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఆయన హామీతో సంతృప్తి చెందినట్లు ప్రకటించడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

# నెక్కంటి.. వ్యూహమేంటి..!

- అధిష్టానం పిలుపుమేరకు రాజధానికి పయనం


మీడియాతో మాట్లాడుతున్న నెక్కంటి భాస్కరరావు

రాయగడ: ప్రతిష్టాత్మకంగా మారిన రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి బీజేడీ తరఫున పోటీ చేసేందుకు ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝికి టిక్కెట్టు ఖరారు కావడంతో ఆ పార్టీ నెలకొన్న తాజాపరిణామాలకు సంబంధించి పార్టీ అధిష్టానం సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావుతో చర్చించేందుకు రాజధానికి ఆహ్వానించినట్లు తెలిసింది. అధిష్టానం పిలుపు మేరకు నెక్కంటి శనివారం రాజధాని పయనమయ్యారు. అనసూయా మాఝికి పార్టీ టికెట్ ఖరారు కావడంతో ఓ వర్గం సంతృప్తి వ్యక్తం చేస్తుండగా మరో వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీంతో నెక్కంటి శుక్రవారం అసంతృప్తి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై అభిప్రాయాలు సేకరించారు. వారిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు భువనేశ్వర్ పయనమైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అనసూయా మాఝికి పార్టీ టిక్కెట్టు ఇవ్వడంతొ ఆమె విజయానికి తాము ఎట్టి పరిస్థితిలో సహకరించేదిలేదని ముక్త కంఠంతో తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన అసంతృప్తి వర్గాన్ని బుజ్జగించేందుకే నెక్కంటిని రాజధానికి పిలిపించినట్లు తెలిసింది. ఇక్కడ 2019లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మకరంద ముదులి విజయం సాధించారు. ఈసారి అటువంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకునేలా అధిష్టానం చర్యలు తీసుకుంటోంది.

**అంతటా ఆసక్తి..**

రాజకీయ చాణక్యుడిగా, అవిభక్త కొరాపుట్ జిల్లాలో మంచి గుర్తింపు పొందిన నెక్కంటి ఈ విషయమై తీసుకొనున్న నిర్ణయంపై అంతా ఆసక్తిగా నెలకొన్నారు. ఒకవేళ అధిష్టానం ఆదేశాల మేరకు అనసూయా మాఝి విజయానికి సహకరిస్తారా.. ఒకవేళ సహకరిస్తే అసంతృప్తి వర్గానికి చెందిన కార్యకర్తల సంగతేంటన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ విషయమై నెక్కంటి సరైన నిర్ణయం తీసుకునేలా అధిష్టానంతో మంతనాలు చేస్తారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. ఆఘమేఘాల మధ్య రాజధానికి పయనమైన నెక్కంటి అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి తలొగ్గుతారా లేక కొత్త వ్యూహాలకు తెరలేపుతారొ వేచిచూడాల్సిందే.

**కార్యకర్తల అభీష్టమే..**

కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి ఎంతగానో శ్రమించారని, వారిలో నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించేలా శాయశక్తులా కృషి చేస్తానని శనివారం ఓ మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో నెక్కంటి పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలకు తానెప్పుడు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

# బాడీ బిల్డింగ్ పోటీలు ప్రారంభం


పోటీలో పాల్గొన్న బాడీ బిల్డర్లు


పోటీలను తిలకిస్తున్న రిఫరీలు

బరంపురం: స్థానిక డైమాండ్ జూబ్లీ టౌన్ హాల్‌లో గంజాం జిల్లా అమేచర్ బాడీ బిల్డింగ్ సంఘం ఆధ్వర్యంలో బాడీ బిల్డింగ్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు గంజాం జిల్లాకి చెందిన వివిధ బ్లాకుల నుంచి 87 మంది పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. వీరిలో ఐదు మంది సెమీ ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కుకుడాఖండి బ్లాక్ చైర్మన్ కామాక్షి ప్రసాద్ పాత్రో, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిత్రరంజన్ స్వాంయి, కార్యదర్శి ప్రశన్న మహేశ్వర్, కోశాధికారి తరిణి చటజీ, ఉపాధ్యక్షుడు బిశంబర్ బౌదర్, గంజాం జిల్లా బాడీ బిల్డింగ్ సంఘం కార్యదర్శి ఎస్.రాజేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ మేనిఫెస్టో కమిటీలో రాష్ట్ర నాయకులు

భువనేశ్వర్: దేశంలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం పార్టీ మేనిఫెస్టో కమిటీలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు బీజేపీ సీనియర్ నాయకులు సభ్యులుగా ఉన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల కోసం 27 మంది సభ్యులతో కూడిన పార్టీ మేనిఫెస్టో కమిటీని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా శనివారం ప్రకటించారు. కమిటీకి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కన్వీనర్‌గా, కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కో-కన్వీనర్‌గా ఉన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, సుందర్‌గఢ్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి జుయల్ ఓరమ్‌లు చోటు దక్కించుకున్నారు. వీరిలో ధర్మేంద్ర ప్రధాన్ సంబల్‌పూర్, జుయల్ ఓరంసుందర్‌గడ్ లోక్‌సభ స్థానాల నుంచి త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తుండగా అశ్విని వైష్ణవ్ ఇటీవలే రాష్ట్రం నుంచి రాజ్యసభకు రెండోసారి ఎన్నికయ్యారు.

# చోరీ కేసులో నిందితుడు అరెస్టు


చందిలి పోలీసులకు చిక్కిన నిందితుడు


నిందితుని నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలు

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి జిల్లాలోని చందిలి పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను పోలీసుస్టేషన్ ప్రాగణంలో ఎస్‌డీపీవో రస్మీరంజన్ సేనాపతి శనివారం వెల్లడించారు. ఈనెల 28వ తేదీన జేకేపూర్‌కు చెందిన నీలకాంత్ సాబొరొ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం దర్యాప్తు చేసిన పోలీసులు, జేకేపూర్‌లోని ఆజాద్ నగర్‌లో నివాసముంటున్న ప్రదీప్ జెన్నాను అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.1.50 లక్షల నగదు, రెండు ద్విచక్ర వాహనాలతో పాటు వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు తరలించారు.

### గుణుపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవిప్రసాద్


కొత్త కార్యవర్గ సభ్యులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ బార్ అసోసియేషన్‌కు శనివారం జరిగిన ఎన్నికల్లో బార్ అధ్యక్షుడిగా దేవి ప్రసాద్ ఆచార్య, ఉపాధ్యక్షులుగా గణేష్ సాహు, సాధారణ కార్యదర్శిగా ఇంద్రాణి ప్రసాద్‌దాస్, సహ కార్యదర్శిగా సురజ్ పాత్రో, కోశాధికారిగా కైలాస్ సాబొరొలు ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

### జిల్లా న్యాయవాదుల సంఘ నూతన అధ్యక్షుడిగా ప్రీత్పాల్ సింగ్



మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో శనివారం జరిగిన న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా ప్రీత్పాల్ సింగ్ ఎన్నికయ్యారు. శనివారం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన ఎన్నికల్లో 126 ఓట్లతో ప్రీత్పాల్ గెలిచినట్లు జిల్లా యూనియన్ లీగల్ ఆఫీసర్ జోసెఫ్ జేమ్స్ ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా తఫస్‌కుమార్ నాథ్, సంపాదకుడిగా బిజు సర్కార్ ఎన్నికయ్యారు.

# సంపర్క్ షార్ట్‌ఫిల్మ్ పోస్టర్ విడుదల


పోస్టరు విడుదల చేస్తున్న నటీనటులు, డైరెక్టర్, నిర్మాతలు

పర్లాకిమిడి: 'సంపర్క్' అనే షార్ట్‌ఫిల్మ్ పోస్టర్‌ను పర్లాకిమిడి రాజవీధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శనివారం ఒడియా సాహిత్య అకాడమీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా, ప్రొడ్యూసర్ జి.వినయ్‌కుమార్ ఆవిష్కరించారు. జి.బి.ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె.కె.సుమన్ ఈ షార్ట్ ఫిల్మ్ నిర్మిస్తున్నారు. హీరోగా రిషి, హీరోయిన్‌గా హిమానీ కవి (బరంపురం) నటిస్తుండగా ఇతర పాత్రాల్లో స్థానిక కళాకారులకు అవకాశం కల్పించినట్లు స్టోరీ, రైటర్, స్క్రీన్‌ప్లే, డైరెక్టర్ కె.కె.సుమన్ తెలిపారు. ప్రేమకథా అంశంతో ఈ చిత్రం రూపొందించినట్లు చెప్పారు.

# రూ.6 కోట్ల విలువైన అక్రమ బంగారం జప్తు


అక్రమ రవాణాలో పట్టుబడిన బంగారం బిస్కెట్లు

భువనేశ్వర్: స్మగ్లింగ్‌లో రూ.6 కోట్లకు పైగా విలువైన బంగారాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్‌ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరిని శనివారం కటక్‌లో అరెస్టు చేశారు. కోల్‌కతా నుంచి కారులో భారీ మొత్తంలో బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు బండలో (మంగూలి) టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా మార్చి 28న కారును అడ్డగించారు. కారులో బిస్కెట్ల రూపంలో బంగారం కనిపించింది. పట్టుబడిన బంగారం బరువు 9,180 గ్రాములు (9.18 కిలోలు). దాని విలువ రూ.6.44 కోట్లుగా అంచనా వేశారు. డీఆర్‌ఐ అధికారులు కారును స్వాధీనం చేసుకున్నారు. అయితే, అరెస్టయిన వ్యక్తుల గుర్తింపుగానీ, వారి గమ్యస్థానాన్ని గానీ అధికారులు వెల్లడించలేదు.

### 162 కిలోల గంజాయి పట్టివేత


గంజాయితో పట్టుబడిన నిందితులు


మల్కన్‌గిరి: జిల్లా బలిమెల పోలీసులు శుక్రవారం రాత్రి 162 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. కోరుకొండ సమితి సోమనాథ్‌పూర్ పంచాయతీ కండేల్‌బంధ గ్రామం వద్ద నుంచి గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నారని బలిమెల ఐఐసీ సుమాన్ పట్నాయిక్‌కు ముందస్తు సమాచారం రావడంతో శుక్రవారం రాత్రి తన సిబ్బందితో కలిసి ఆయన దాడి చేశారు. దీంతో 6 బస్తాల్లో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు పట్టుబడ్డారు. మరో ముగ్గురు పరారయ్యారు. దొరికిన వారు కండేల్‌బంధ గ్రామానికి చెందిన చైతన్య ఖీలో, సుబాష్ ముదిలిగా తెలిసింది. వీరిని శనివారం కోర్టులో హాజరుపరిచారు. దొరికిన గంజాయి విలువ రూ.18 లక్షలు ఉంటుంది.

# జయపురంలో రామనవమికి సన్నద్ధం


శ్రీరామనవమి మహోత్సవాల సన్నాహక సమావేశంలో పాల్గొన్న శ్రీరామ భక్తులు

జయపురం: ఈ ఏడాది ఏప్రిల్ 17న శ్రీరామ నవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు జయపురం శ్రీరామ నవమి పూజా కమిటీ నిర్ణయించింది. స్థానిక చైతన్య మందిర ప్రాంగణంలో శనివారం చందన రాథోడ్ అధ్యక్షతన శ్రీరామ నవమి ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణకు సభికులు ఇచ్చిన సలహాలను, ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొని వాటి నిర్వహణపై చర్చించారు. శ్రీరామ నవమి 17 వ తేదీన ఫవర్ హౌస్ జంక్షన్ నుంచి దసరాపొడియ (విక్రమ్ క్రీడా మైదానం) వరకు అతి పెద్ద ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ బాధ్యతను నిరంజన్ పాణిగ్రాహికి అప్పగించారు. చందన రాథోడ్, విశ్వనాథ్ నందోలు పాణిగ్రాహికి సహకరించాలని తీర్మానించారు. సిద్ధార్థ పాత్రో, అరుణ జైన్‌లను ఫైనాన్స్ కమిటీగా నియమించారు. సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ నేత బాబు భజరంగ్,సుభేంధు బ్రహ్మ, సతీష్ నంద, సంతోష్ సాహు, లలిత్ అగర్వాల్, రజనీ నాయిక్, మహేష్, శంకర ప్రహరాజ్, ప్రతాప్ పట్నాయిక్, సందీప్ దొలాయ్, రంజిత్ నాయిక్, వీరప్రసాద్ హొత్త, కె.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పూరీ జగన్నాథ ఆలయంలోకి విదేశీయుడు


పోలీసులకు చిక్కిన విదేశీయుడు

భువనేశ్వర్: పూరీ జగన్నాథ స్వామి దేవాలయంలోనికి విదేశీయుడు శనివారం చొరబడ్డాడు. ఈ నెలలో వరుసగా రెండోసారి హిందూయేతర విదేశీ పౌరుడు ప్రవేశించడం గమనార్హం. మూడంచెల భద్రత వ్యవస్థని అధిగమించి శ్రీ మందిరం సముదాయంలోనికి అనధికారిక వ్యక్తులు చొరబడటం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హిందువుల సంప్రదాయ దుస్తులు ధరించిన విదేశీ జాతీయుడు మధ్యాహ్నం ఆలయం లోపల బెహరాన్ గేటు వద్ద తచ్చాడుతున్నట్లు సేవకులు గుర్తించారు. సమాచారం అందడంతో ఆలయ సమీపంలో సింహద్వార్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు రాక గుర్తించిన విదేశీయుడు తప్పించుకునేందుకు విఫలయత్నం చేశాడు. పోలీసులకు చిక్కడంతో పూరీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిని నిర్బంధించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లో యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన థామస్ క్రెయిగ్ షెల్డన్‌గా గుర్తించారు. ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి భద్రతా వ్యవస్థని అధిగమించి థామస్ ఆలయంలోకి ఎలా ప్రవేశించాడనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అంతకంటే ముందు స్వర్గద్వార్ సమీపంలోని బీచ్‌లో మద్యం మత్తులో ఇబ్బంది కలిగించినందుకు సీ బీచ్ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు.


# ఫ్లాగ్ మార్చ్


పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

రాయగడ: సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు రాయగడలో పోలీసులు, సీఆర్పీఎఫ్ దళాలు సంయుక్తంగా ఫ్లాగ్‌మార్చ్ శనివారం నిర్వహించాయి. రాయగడ పోలీసుస్టేషన్ అధికారి కేబీకే కుహరో నేతృత్వంలో పట్టణంలో అన్ని వీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.


సీఆర్పీఎఫ్ దళాల ఫ్లాగ్‌మార్చ్

# 2 నుంచి ఉదయం పూట బడులు


ఎన్‌డీఎంఏ విపత్తు నిర్వహణ సమావేశంలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్న ఎస్‌ఆర్‌సీ అధికార వర్గాలు

భువనేశ్వర్: రాష్ట్రంలో వడగాడ్పుల పరిస్థితి తీవ్రం అవుతుంది. ఈ పరిస్థితుల దృష్ట్యా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బడులు ఒంటి పూట పని చేస్తాయని రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అందరికీ ఉదయం పూట తరగతులు నిర్వహించాలని ఉత్తర్వులు పేర్కొన్నాయి. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల, సామూహిక విద్యా శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. నిత్యం ఉదయం 7 గంటల నుంచి 11.30 గంటల వరకు ఉదయం పూట తరగతులు నిర్వహించాలని తెలిపింది. పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు అందేలా చూడాలని ఆదేశించింది. రాష్ట్రంలో అనేక చోట్ల ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ దాటుతున్నాయి. రాబోయే రోజుల్లో వడగాడ్పులు పుంజుకుంటాయని ఐఎండీ ప్రాంతీయ వాతావరణ కేంద్రం ముందస్తు సమాచారం జారీ చేసింది. వడగాడ్పులు, వడ దెబ్బ వైపరీత్య పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రత్యేక సహాయ కమిషనరు ఎస్‌ఆర్‌సి కలెక్టర్లకు లేఖ రాశారు. ఉష్ణోగ్రత నిత్యం పెరుగుతున్నందున నీటి ఎద్దడి నివారణకు యంత్రాంగం సన్నద్ధం కావాలని ఎస్‌ఆర్‌సీ కార్యాలయం ఆదేశించింది. వేసవిలో నిరంతర తాగునీటి సరఫరా, అంతరాయం లేని విద్యుత్ అందేలా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడానికి శనివారం జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఎంఏ) రాష్ట్ర వర్గాలతో వీడియో కాన్ఫరెన్సులో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అదనపు ప్రత్యేక సహాయ కమిషనర్‌తో అనుబంధ అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ అభ్యర్థులు ఖరారు

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ శనివారం మలివిడత జాబితా విడుదల చేసింది. ఇందులో 3 పార్లమెంటు నియోజక వర్గాలకు అభ్యర్థుల్ని ఖరారు చేసినట్లు పేర్కొంది. కటక్ లోక్‌సభ స్థానం నుంచి భర్తృహరి మహతాబ్, కంధమల్ నుంచి సుకాంత కుమార్ పాణిగ్రాహి, జాజ్‌పూర్ నుంచి రవీంద్ర నారాయణ్ బెహరాను పోటీకి దింపుతున్నట్లు బీజేపీ ప్రకటించింది.

కటక్ లోక్‌సభ సిటింగ్ సభ్యుడు భర్తృహరి మహతాబ్ ఇటీవల అధికార పక్షం బిజూ జనతా దళ్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. చివరి క్షణంలో ఆయన అభ్యర్థిత్వాన్ని కటక్ నియోజకవర్గం నుంచి ఖరారు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నియోజకవర్గంలో సరికొత్త ముఖం బిజూ జనతా దళ్ అభ్యర్థి సంతృప్త్ మిశ్రాతో సిటింగ్ ఎంపీ భర్తృహరి మహతాబ్ తలపడనున్నారు. రాష్ట్రంలో 21 లోక్‌సభ స్థానాలకు ఎన్నిక జరగనుంది. తొలి జాబితాలో భారతీయ జనతా పార్టీ 18 స్థానాలకు, బిజూ జనతా దళ్ 15 పార్లమెంటరీ నియోజక వర్గాలకు అభ్యర్థుల్ని ప్రకటించాయి. తాజా జాబితాతో రాష్ట్రంలో పార్లమెంటు స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన పూర్తయ్యింది.

## క్లుప్తంగా

### వెంకటరాజపురంలో గజరాజులు


వెంకటరాజపురంలో గజరాజుల గుంపు

**జియ్యమ్మవలస:** మండలంలోని వెంకటరాజపురంలో ఉన్న శివాలయం, ఎల్లమ్మతల్లి ఆలయం వద్ద గజరాజుల గుంపు శనివారం దర్శనమిచ్చాయి. అక్కడ ఉన్న వాటర్ పైపులను ధ్వంసం చేశాయి. తరువాత దగ్గరలో ఉన్న అరటి తోటలోకి ప్రవేశించి మత్స సింహాచలం నాయుడుకు చెందిన పంటను ధ్వంసం చేశాయి. ఉదయం 8 గంటల సమయంలో గుమ్మిడిగెడ్డ వాగులోకి జారుకున్నాయి. వీటి సంచారంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

### రోడ్డు ప్రమాదంలో గీత కార్మికుడి మృతి


ఈశ్వరరావు (ఫైల్)

**దత్తిరాజేరు:** మండలంలోని కోమటిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని చుక్కపేట గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కొలిసి ఈశ్వరరావు(34) అక్కడికక్కడే మృతి చెందినట్టు పెదమానాపురం ఎస్ఐ శిరీష తెలిపారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మృతుడు ఈశ్వరరావు శుక్రవారం రాత్రి తన బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి అక్కడే ఉండిపోయాడు. తన ద్విచక్ర వాహనంపై శనివారం తెల్లవారుజామున తాటికల్లు తీయడానికి స్వగ్రామం బయలుదేరి వస్తుండగా కోమటిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని తలపై నుంచి వెళ్లడంతో తల నుజ్జయింది. మృతుడికి భార్య వెంకటమ్మ, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు


పట్టుబడిన మద్యం సీసాలతో పోలీసులు

**బొబ్బిలి:** మండలంలోని కారాడ గ్రామానికి చెందిన ఈదుబిల్లి పార్వతి 61 మద్యం సీసాలు కలిగి ఉన్నట్టు గుర్తించి అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ బీవీ మురళీధర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలో శనివారం దాడులు నిర్వహించగా మద్యం సీసాలతో మహిళ పట్టుబడ్డట్టు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు ఎస్వీ రామారావు, ఎల్.తిరుపతిరావు, హెచ్‌సీ బి.మాధవిదేవి, బి.ఆదినారాయణ, వై.సరస్వతి పాల్గొన్నారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం

**సంతకవిటి:** మండల పరిధి జి.ఎస్.పురం గ్రామంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి అక్రమంగా తరలిస్తున్న 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ శంకర్ శనివారం తెలిపారు. అక్రమంగా మద్యం తరలించినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ఎస్సీ సామాజిక వర్గానికి క్షమాపణలు చెప్పాలి

**నెల్లిమర్ల రూరల్:** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎస్సీ సామాజిక వర్గానికి క్షమాపణలు చెప్పాలని టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగనమల నియోజకవర్గ బహిరంగ సభలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులను టిప్పర్ డ్రైవర్ అంటూ చంద్రబాబు విమర్శించడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. వెంటనే ఎస్సీ సామాజిక వర్గానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

### రైల్వే కేబుల్ చోరీ కేసులో 8మంది అరెస్టు

**శృంగవరపుకోట:** స్థానిక రైల్వేస్టేషన్‌లో నాలుగు రోజుల క్రితం జరిగిన చోరీ ఆలస్యంగా వెలుగు చూసింది. విశ్వసనీయ వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు కేసు వివరాలిలా ఉన్నాయి. స్థానిక రైల్వే స్టేషన్‌లో ఇటీవల వచ్చిన కొత్త రైల్వే వ్యాగన్‌ను పార్క్ చేసి ఉంచారు. నాలుగు రోజుల క్రితం పట్టణానికి చెందిన దొంగల ముఠా రైల్వే వ్యాగన్ కింది భాగాన ఉన్న కాపర్ కేబుల్‌ను కత్తిరించి తీసేశారు. ఈ కేబుల్‌ను పట్టణంలో రెండు స్క్రాప్ షాప్‌లకు అమ్మేశారు. కేబుల్ చోరీకి గురవటంతో రైల్వే అధికారులు చోరీ కేసును ఛేదించేందుకు రైల్వే పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి మూడు రోజుల నుంచి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది. ముందుగా దొంగిలించబడ్డ రైల్వే కేబుల్ కొన్న స్థానికంగా ఉన్న రెండు స్క్రాప్ షాప్‌లను నిర్ధారించిన రైల్వే పోలీసులు సదరు స్క్రాప్ దుకాణాల యజమానులపై కేసు నమోదు చేశారు. వీరితో పాటు దొంగతనానికి పాల్పడ్డ మరో ఆరుగురు నిందితుల్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కాగా వీరిలో ఇద్దరు బాల నేరస్థులు ఉన్నారు.

# డిమాండ్‌కు తగ్గ విద్యుత్ సరఫరా


విద్యుత్ సబ్ స్టేషన్

- ఏటా పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- ఐదేళ్లలో 14,211.11 మిలియన్ యూనిట్ల వినియోగం
- జిల్లాలో 7,24,719 విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు వివరాలు...

| | |
|---|---|
| కేటగిరి - 1 కనెక్షన్లు | :6,04,535 |
| కేటగిరి - 2 కనెక్షన్లు | :65,194 |
| కేటగిరి - 3 కనెక్షన్లు | :2,822 |
| కేటగిరి - 4 కనెక్షన్లు | :14,168 |
| కేటగిరి - 5 కనెక్షన్లు | :38,000 |

**విజయనగరం ఫోర్ట్:** జిల్లాలో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతుంది. అయినా వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. గతంలో కంటే వినియోగం గణనీయంగా పెరిగినా విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో వినియోగించే ఫ్యాన్లు స్థానంలో నేడు కూలర్లు, ఏసీలు ఎక్కువగా వాడుతున్నారు. గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన కూలర్లు, ఏసీలు నేడు పల్లెల్లో కూడా ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఫలితంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా రైతులకు ఇబ్బంది లేకుండా 9 గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. నిరంతరం విద్యుత్ సరఫరా చేయడం వల్ల వర్షాభావ పరిస్థితుల్లో కూడా రైతులు పంటలను కాపాడుకోగలుగుతున్నారు.

**ఏటా పెరుగుతున్న విద్యుత్ వినియోగం**

జిల్లాలో విద్యుత్ వినియోగం ఏటా పెరుగుతుంది. విద్యుత్ వినియోగం పెరగడం వల్ల ప్రభుత్వంపై భారం పెరిగినప్పటికీ విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తోంది. విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగినప్పడు రైతులు, గృహ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేస్తోంది. 2019 నుంచి ఇప్పటి వరకు విద్యుత్ కోతలు లేకుండా ప్రభుత్వం విద్యుత్ సరఫరా చేసింది. గతంలో లోవోల్టేజ్ సమస్య, ట్రిప్ కావడం వంటి సమస్యలు అధికంగా ఉండేవి. దీని వల్ల వినియోగదారులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ఎటువంటి సమస్య లేకుండా గడిచిన ఐదేళ్లలో నాణ్యమైన విద్యుత్‌ను ప్రభుత్వం సరఫరా చేసింది. లోవోల్టేజ్ , ట్రిప్ కావడం వంటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టింది.

2019 నుంచి 2024 ఫిబ్రవరి వరకు జిల్లాలో విద్యుత్ వినియోగం వివరాలు

| సంవత్సరం | మిలియన్ యూనిట్లలో |
|---|---|
| 2019-20 | 2409.46 |
| 2020-21 | 2273.96 |
| 2021-22 | 2892.26 |
| 2022-23 | 3412.69 |
| 2023-24 | 3223.74 |
| మొత్తం | 14212.11 |

**కోతలు లేకుండా విద్యుత్ సరఫరా**



వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. అయినప్పటికీ గడిచిన ఐదేళ్లలో విద్యుత్ కోతలు లేకుండా ప్రభుత్వం విద్యుత్‌ను అందించింది.
– రంధి నాగేశ్వరావు, పెదవేమలి

**నాణ్యమైన విద్యుత్ సరఫరా**



గతంలో లోవోల్టేజ్ సమస్య ఉండేది. దీంతో కరెంటు వినియోగించి చేసే పనులకు అటంకం కలిగేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో నాణ్యమైన విద్యుత్‌ను ప్రభుత్వం అందించింది. లోవోల్టేజ్ సమస్య అనేది లేదు. వ్యవసాయనికి 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించింది. – పోటుపురెడ్డి సత్యనారాయణ, రాకోడు

# దళిత ద్రోహి చంద్రబాబు


సమావేశంలో మాట్లాడుతున్న జైహింద్‌కుమార్

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్

**గంట్యాడ:** దళిత ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్ ఆరోపించారు. మండలంలోని రామవరం గ్రామంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లా శింగనమల అసెంబ్లీ టిక్కెట్‌ను దళితుడైన వీరంజనేయులకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇస్తే ఓర్వలేని చంద్రబాబు టిప్పర్ డ్రైవర్‌కు టిక్కెట్ ఇచ్చాడని అవహేళనగా మాట్లాడాడని తెలిపారు. తొలి నుంచి చంద్రబాబుకు దళితుల పట్ల చిన్నచూపేనని ఆరోపించారు. గతంలో కూడ దళితుడిగా ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని మాట్లాడారని గుర్తు చేశారు. అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగల పట్ల వర్గీకరణ చిచ్చు పెట్టిన దుర్మార్గుడు చంద్రబాబు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో దళితులు, బీసీలు, మైనార్టీలు చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను మోసం చేసి డబ్బులకు టికెట్లు అమ్ముకున్న ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. దళితులకు అధిక ప్రాధాన్యతను ఇచ్చిన గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. పేదవాడైన నందిగాం సురేష్‌ను ఎంపీగా చేసిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. సమావేశంలో దళిత నాయకులు భూషణం, గురువులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

**విజయనగరం అర్బన్:** ఉద్యోగ విరమణకు ఏడాది సర్వీసు మాత్రమే ఉన్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ, రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆయా సంఘాల ప్రతినిధులు కలెక్టర్ ఎస్. నాగలక్ష్మిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులు, దీర్ఘకాలిక వ్యాధులు, గుండె జబ్బులున్న వారు, గర్భవతులు, బాలింతలకు విధుల నుంచి తప్పించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వివిధ సంఘాల ప్రతినిధులు డి.ఈశ్వరరావు, పైడిరాజు, పురుషోత్తం నాయుడు, కె.జోగారావు, చిప్పాడ సూరిబాబు, గోవిందరావు, మురళి, రామకృష్ణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

### గంజాయి కేసులో ముద్దాయిలకు జైలు, జరిమానా

**విజయనగరం క్రైమ్:** గంజాయి కేసులో ముద్దాయిలకు ఏడాది జైలు, జరిమానా విధిస్తూ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శనివారం తెలిపారు. వివరాలు.. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రిజర్వేషన్ కౌంటర్ వెనుక భాగంలో 2023 ఫిబ్రవరి 2న ఇద్దరు వ్యక్తులు గంజాయి ప్యాకెట్లు అమ్మడానికి ప్రయత్నిస్తుండగా వన్‌టౌన్ పోలీసులకు అందిన సమాచారంతో రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని నిందితుడు భర్తకాన శేఖర్, షేక్ ఖురేషలను అదుపులోకి తీసుకుని వారి నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై అప్పటి వన్‌టౌన్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ కేసు నమోదు చేయగా, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రాలను దాఖలు చేశారు. కోర్టు ప్రాసిక్యూషన్‌లో నిందితులపై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.రమ్య ఏడాది జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లుగా వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. కేసులో ఏపీపీ రాజ రాజేశ్వరి పోలీసుల తరపున వాదనలు వినిపించగా, వన్‌టౌన్ కోర్టు హెచ్‌సీ పివి.ఆనంద్ సాక్ష్యులను కోర్టులో హాజరుపర్చారన్నారు.

## పటిష్ట భద్రత : ఎస్పీ

**విజయనగరం క్రైమ్:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన భద్రత చర్యలను ఎస్పీ ఎం.దీపిక శనివారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పాత బొబ్బిలి వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టును సందర్శించి, పోలీస్ సిబ్బంది చేపడుతున్న వాహన తనిఖీలను పరిశీలించారు. ఇరు జిల్లాల మధ్య వచ్చి, పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాహనాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ రాజకీయ పార్టీలు తరలించే మద్యం, సారా, గంజాయి, నగదు, ప్రోత్సాహక బహుమతులు, చీరలు, వాచీలు వంటి ఇతర వస్తువుల అక్రమ రవాణాను నియంత్రించాలన్నారు. వాహన తనిఖీల్లో అక్రమ రవాణాకు వినియోగించే వాహనాలను, వస్తువులను సీజ్ చేయాలని, ఆయా వస్తువులను తరలించేందుకు బాధ్యులను గుర్తించి, వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మెట్టవలస, పారాది పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ తేదీన పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునే వారు మినహా ఇతరులెవ్వరూ కూడా ఆయా ప్రాంతంలో లేకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఇప్పటి వరకూ చేపట్టిన భద్రత చర్యలను బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, బొబ్బిలి సీఐ ఎం.నాగేశ్వరరావు ఎస్పీకి వివరించారు. తనిఖీల్లో పోలీస్ అధికారులు, కేంద్ర పోలీసు బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సెంచూరియన్‌లో వేడుకగా ఫ్రెషర్స్ డే


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన బొండపల్లి ఎస్ఐ లక్ష్మణరావు మాట్లాడుతూ యువత ఏ చిన్న తప్పు చేసినా పోలీస్ రికార్డుల్లో నమోదయ్యే ప్రమాదం ఉందని, విద్యార్థి దశలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఒకసారి పోలీస్ రికార్డులో పేరు నమోదైతే భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, సిబ్బంది పాల్గొన్నారు.

### మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

- వచ్చేనెల 6వ తేదీ వరకు అవకాశం

**విజయనగరం అర్బన్:** ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరంలో 6వ తరగతి ప్రవేశాలకు వచ్చేనెల 6వ తేదీ వరకు గడువు పెంచినట్టు డీఈఓ ఎన్.ప్రేమ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న 13 ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. వచ్చేనెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 'సీఎస్ఈ.ఏపీ.జీఓవి.ఐఎన్' లేదా 'ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ (ఆన్‌లైన్)'లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## ఘనంగా రామనారాయణం వార్షికోత్సవం


దేవతామూర్తులకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**విజయనగరం రూరల్:** ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణం దశమ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటల నుంచి దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనారాయణులకు పంచామృతాభిషేకాలు, స్నపనం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు సీతారాములకు కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- సాల్‌వెన్సీ సర్టిఫికెట్ మంజూరుకు లంచం డిమాండ్
- రూ.2,600 తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుపబడిన కార్యదర్శి మురళి


ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి మురళి

**మక్కువ:** మండలంలోని కాశీపట్నం పంచాయతీ కార్యదర్శి పెంట మురళి శనివారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ డీఎస్పీ రామచంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం... మక్కువ మండలంలోని కన్నంపేట గ్రామానికి చెందిన చీకటి ఆదినారాయణ ఇటీవల ఎక్సైజ్ అధికారులకు సారా ప్యాకెట్లతో పట్టుబడ్డాడు. ప్రస్తుతం ఆయన బొబ్బిలి సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్నారు. బెయిల్ మంజూరుకోసం దరఖాస్తు చేయాలంటే ఇద్దరు వ్యక్తులు పూచికత్తులు (జామీనా) అవసరం. కాశీపట్నం పంచాయతీ కొండరేజేరు గ్రామానికి చెందిన చంద్రరావు, ఈశు అనే వ్యక్తులను జామీనుగా ఉండాలని నిందితుడి కుమారుడు గణపతి కోరారు. దీనికోసం వారిద్దరికీ అవసరమైన సాల్‌వెన్స్ సర్టిఫికెట్ల కోసం పంచాయతీ కార్యదర్శి పెంట మురళీకి దరఖాస్తు చేశాడు. దీనికోసం కార్యదర్శి రూ.4వేలు డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని చెప్పగా లేనిపోని పదజాలంతో గణపతిని దూషించారు. చివరకు రూ.2,600 ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం ఏసీబీ అధికారులను గణపతి ఆశ్రయించాడు. పథకం ప్రకారం ఏసీబీ డీజీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ రామచంద్రరావుతో పాటు, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, మహేశ్వరరావు, రమణ, విద్యుత్ శాఖ డీఈ తిరుపతిరావు, సీనియర్ అసిస్టెంట్ పీకేవీ ప్రసాదులు సచివాలయానికి చేరుకున్నారు. గణపతి నుంచి పంచాయతీ కార్యదర్శి మురళి రూ.2,600 తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ రామచంద్రరావు తెలిపారు.

# టీడీపీని వీడి.. వైఎస్సార్‌సీపీలో చేరిక


విజయనగరం: కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో టీడీపీ, జనసేనలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 40 కుటుంబాల సభ్యులు

- 12వ డివిజన్‌కు చెందిన 40 కుటుంబాల చేరిక
- పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన ఆశపు వేణు, రాజేష్

**విజయనగరం:** టీడీపీ, జనసేన పార్టీల్లో నిరాదరణకు గురై విసిగి వేసారి వైఎస్సార్‌సీపీలో చేరామని 12వ డివిజన్‌కు చెందిన పలువురు వెల్లడించారు. నగరంలోని పల్లివీధి, ఇప్పిలివీధి, అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో నివాసముంటున్న కూటమికి చెందిన 40 కుటుంబాలు ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. ఈ సందర్భంగా వారందరికీ పార్టీ కండువాలను వేసి కోలగట్ల సాదరంగా ఆహ్వానించారు. కోలగట్ల నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో నూతనంగా చేరిన వారంతా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం ఎమ్మెల్యేగా కోలగట్ల గెలుపునకు సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన పట్ల, నగరంలో తాము చేస్తున్న అభివృద్ధి పట్ల ఆకర్షితులై పలువురు చేరడం శుభపరిణామంగా తెలిపారు. కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారు నాయుడు మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి కష్టాలు ఎదురైనా కోలగట్ల అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కరోనా కష్ట కాలంలో ప్రజలకు ఎంతో అండగా నిలిచామని గుర్తు చేశారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా ఎనీ టైం సర్వీస్ అనే నినాదంతో సేవలు అందిస్తున్నారన్నారు. భవిష్యత్తులో అందరి అభిమానంతో మరోసారి శాసనసభ్యులుగా గెలిచి మరింత ప్రజాసేవకు కోలగట్ల పునరంకితమవుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, కార్పొరేటర్ వింత ప్రభాకర్ రెడ్డి, పార్టీ నాయకులు బొంగ భానుమూర్తి, కేఏపీ రాజు, వెత్సా శ్రీను, కొయ్యాన రమేష్, పొంతపల్లి మురళి, మైలపల్లి రాజు, మధుసూధనరావు, రామ్‌కోటి, పోతుల రాజు, పంచ గంట్ల ప్రవీణ్, యశ్వంత్, దొడ్డి మనోహర్, చోడిపిల్లి కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.


వీరఘట్టం: కడకెల్లకు చెందిన టీడీపీ నాయకుడు మర్రాపు ఉమామహేశ్వరరావుకు వైఎస్సార్‌సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కళావతి

**జగన్‌తోనే సంక్షేమ పాలన : ఎమ్మెల్యే కళావతి**

**వీరఘట్టం:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలంతా జేజేలు పలుకుతున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. కడకెల్ల, నడుకూరు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేస్తుండంగా కడకెల్లకు చెందిన మర్రాపు ఉమామహేశ్వరరావు, బడి అప్పలనాయుడు, దత్తి రామకృష్ణ, నిడగంటి అప్పడు, దారపురెడ్డి కన్నంనాయుడు, నిడగంటి ప్రమీల, సిరిపురం చిట్టి, గాడి విజయ, ముచ్చు గంగ తదితర 105 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. అలాగే నడుకూరు గ్రామానికి చెందిన 5 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే కళావతి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, నడిమికెల్ల సర్పంచ్ డోకల సుజాత, డోకల శ్రీను, గుంట్రెడ్డి గౌరీశంకరరావు ,నడుకూరు సర్పంచ్ కర్రి రమాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రదాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీలో చేరికలు జరిగాయి.

## విధుల నుంచి తప్పకున్న వలంటీర్

**దత్తిరాజేరు:** మండలంలోని వంగర గ్రామానికి చెందిన వలంటీర్ ఇమంది రవి (శంకర్) విధుల నుంచి తప్పుకుంటూ.. రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ చంద్రకుమారికి శనివారం అందజేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన వలంటీరు వ్యవస్థ వల్లే ప్రజలకు సేవలందించే అవకాశం దక్కిందని, ఎన్నికల వేళ ఆయన రుణం తీర్చుకునేందుకు రాజీనామా చేసినట్టు తెలిపాడు. జగనన్నను మరోసారి సీఎంను చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని పేర్కొన్నాడు. వలంటీర్ రాజీనామా పత్రం అందినట్టు ఎంపీడీఓ తెలిపారు.


రాజీనామా పత్రాన్ని ఎంపిడీఓకు అందజేస్తున్న వలంటీర్ రవి

## కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**విజయనగరం అర్బన్:**

కేంద్రీయ విద్యాలయం (బాబామెట్ట)లో వివిధ తరగతుల ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణను నోటిఫికేషన్ విడుదలైనట్టు ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1వ తరగతి సీట్ల కోసం వచ్చే నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. 2వ తరగతి, ఆపై తరగతులలో ప్రస్తుతం ఖాళీలున్న సీట్ల భర్తీకి వచ్చే నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తుల కోసం 'కేవీఎస్‌ఆన్‌లైన్‌ఎడ్మిషన్.కేవీ.జీఓవి.ఐఎన్' వెబ్‌సైట్‌లో, గైడ్‌లైన్స్ కోసం 'కేవీసంఘటన్.ఎన్ఐసీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.